
# లంచం



**బలివాడ కాంతారావు**

ముకుందరావు ఒకనాడు సాయంత్రం విశాఖపట్నం మెయిన్ రోడ్డుమీద వెళ్లిపోతుండగా "ఏమండోయ్- ఏమండీ" అన్న కేకలు వినిపించగానే అగాడు. జనసమూహాన్ని దాటుకుంటూ ఒకవ్యక్తి తనదగ్గరకువచ్చి "నెలరోజులై మీకోసం గాలిస్తున్నాను. నా అదృష్టంకొద్దీ యీరోజు మిమ్మల్ని పట్టుకోగలిగాను ... నన్ను గుర్తుపట్టారా?"

ముకుందరావు చిన్న నవ్వుతో "మిమ్మల్ని యెలా మరచిపోతాను ?"

"క్షమించండి. మీదగ్గర లంచం పుచ్చుకున్నానే గానీ – ప్రతిక్షణం ఛస్తున్నాననుకోండి" "మిమ్మల్ని అలా బాధించడానికి ? లంచంగా నే నిచ్చిన వస్తువులో యే దోషం లేదే" "నెల రోజుల క్రితం ఒక మాసపత్రికలో ఒక కథ చదివాను. అది చదివిన దగ్గరనించీ నాకు మనశ్శాంతి పోయింది. లంచం యింకెప్పుడూ పుచ్చుకోదలచుకో లేదు."

ముకుందరావు అతని భుజంమీద చెయ్యివేస్తూ "మీ పేరు శేషగిరి కదూ?"

"బాగా గుర్తుంచు కున్నారే ?" "శేషగిరిగారూ! ఒక కథచదివి యింతగా మారిపోయారే- మిమ్మల్ని కదలించిన ఆ కథ నేనూ వినకూడదా ?"

"మాయింటికి రండి వినిపిస్తాను." "మీరు చదివేకన్న చెప్పితే వినడానికి బాగుంటుందేమో ? చెప్పండి" అంటూ అక్కడేవున్న సందుమలుపులోనికి తిరిగి ఒక గోడకు ఆనుకుని నిల్చున్నాడు.

శేషగిరి తను చదివిన "లంచం" కథను చెప్పడానికి మొదలు పెట్టాడు

"సత్యారావు ఒక గవర్నమెంటు వుద్యోగి, పేరు తగ్గట్లు సత్యమే పలుకుతాడు, ఒకరిదగ్గర లంచం యే రూపానా పుచ్చుకోడు, ఒకరికి లంచం యివ్వడు. ఒకరోజు సత్యారావు ఒక ఆఫీసులో మాసిన గెడ్డంతో పెన్షను క్లయిము చేసే గుమస్తా యెదుట నిల్చుంటాడు, ఆ గుమస్తా మాంచి యౌవ్వనంలో వుంటాడు. కోరికలు తక్కువలేవు. మాట్లా

డానికీ, మింగడానికి మంచి గొంతుక వుంది .

"అయ్యా! పెన్సను క్లయిము"అంటే

"ఫోవయ్యా- ఫో! నీ ఒక్క పెన్సను క్లయిమే చేసుకుకూర్చుంటానా?" ఎవరు నువ్వు? నీ పేరేమిటి? ఏ వూర్లో ఏ అఫీసులో ఏ గ్రేడులో రిటైరయ్యావు - అని ఏదీ అడక్కుండానే మెషీన్ గన్ ఫైరులా మాటాడేస్తుంటే సత్యారావు సవినయంగా అంటాడు "బాబు. నువ్వాఏదో ఒక రోజున రిటైరవుతావు. నీ పెన్సను క్లయిము ఎవడో ఒకడు వేగంగా చెయ్యాలికదా, ఈ నాడు ఒక రిటైరైన మనిషి ఆశీర్వాదం ఆ నాడు నీకు సహాయం చేస్తుంది, చాలా కాలం పెన్సను పుచ్చుకుంటావు"

"నేను కావాలని ఆలస్యం చేస్తున్నానా? నేనూ మనిషినే. నాకున్నది ఒకే కుడిచెయ్యి. ఒకే మెదడు, వెళ్లవయ్యా వెళ్లు, నాకు నీతులు బోధించకు, వీటి మీద నాకు నమ్మకం లేదు"

ఇంకా మాటాడనివ్వకండా గబ గబ సీటువించే వెళ్ళిపోయాడు, ఆఫీసరుని కలవడానికి అతను లేడు. ఇదంతా వింటున్న బంట్రోతును అడిగితే కేంపుకు వెళ్లాడని అబద్ధం చెప్పాడు. ఆఫీసర్ని కలిసినా లాభం యేమిటి? తప్పులు లేకుండా క్లయిము చేయవలసిన వాడు యీ గుమస్తాకదా, సత్యారావుకు యేమీ తోచక తిరుగు ముఖం పట్టుంటే బంట్రోతు వెనుకనే వచ్చి అంటాడు.

" బాబూ. ఉండ్రాళ్లు వడ్డించండి ఆది విగ్నేస్వరులవారే అగపడరు. ఈ పెన్సను బాబు లంచం పుచ్చుకోడంటే పుచ్చుకోడు. చాలా కరక్టు మనిషి, ఆ బాబుతో జగడమాడకండి "

"అతను ఆడుతున్నాడా నేను అడుతున్నానా " అంటే

"ఆ బాబుకీ అలాగే కుండ పగిలినట్టు మాటాడటం అలవాటు. ఆ బాబు ఉంగరం యెవుడో దొంగలాడేసారు. మీ సేతనున్న ఆ పచ్చ పొడివుంగరం పారేయండి , రేపే పెన్సను కాగితాలు కరక్టుగా యెల్లి పోతాయి"

"ఈ వుంగరమే యివ్వాలా ?"

"పోనీ అలాంటిది ఒకటి కొనేసి యిచ్చేయండి"

"అంతడబ్బు లేదు "

"అయితే యిదే ఇచ్చేయండి అలాగ సంశయిస్తారేటి ? గాజుపొడి వుంగరమేగా ? ఈయన కరక్టుమనిషి. ఆ ఉంగరం యింకెవురైనా యిస్తే మరి మీ దగ్గర పుచ్చుకోడు, మీ పనికాదు "

బంట్రోతు ఉపదేశం విన్నాక సత్యారావు తటాపటాయిస్తూనే వుంగరం గుమస్తాకు అర్పితం చేసి క్లయిము వివరాలన్ని యిస్తాడు. మింగిన గొంతుక మోటుగా మాటాడకండా సాగనంపింది,

సత్యారావు యెలమంచిలి చేరుకోగానే అలవాటుకొద్దీ అతనిభార్య చామంతి వుంగరం చెయ్యిపట్టుకుని "వుంగరమేదీ? " అని అరిచింది,

"లంచంగా యిచ్చేసాను"

"మీకు లంచంయిచ్చే ఖర్మయెందు కొచ్చిందండీ "

"లక్ష్మయ్య గుర్తున్నాడా? "

"ఇప్పుడెక్కడున్నాడు?"

"విశాఖపట్నంలోకనిపించాడు, రిటైరయ్యి యేడాది దాటినా వాడి పెన్సను కాగితాలింకా వెళ్ళ లేదట, వాడి యిబ్బందులు చెప్తూ కళ్లల్లో నీరు తెచ్చుకున్నాడు. సరేనని ఆ ఆఫీసుకు వెళ్లాను, కొత్తగా వచ్చిన గుమస్తా, ఆ క్లయిము నాదేఅనుకుని లంచం యిస్తేగానీ కదలదని,-"

"ఉంగరం యిచ్చేసారు, ఎంతపని చేసారండీ" అంటూ చామంతి కన్నీరు తెచ్చుకుంటే సత్యారావుకు కోపం వచ్చి ఆ లక్ష్మయ్య మనక్రింద తక్కువ సేవ చేసాడా? అంతా మరచిపోయావా? వాడి కష్టకాలంలో యీమాత్రం సహాయం చెయ్యక పోతే,...."

"చెయ్యండి. ఎవరొద్దన్నారు? మీరు ఆర్జించిన డబ్బుతో సహాయం చెయ్యండి, నేనుమీచేతిలో పెట్టినవుంగరం లంచంగా యివ్వడానికి మీచేతులెలా వచ్చాయ్"

"బోడి వుంగరం పోతే పోయింది. డబ్బున్నప్పుడు యింకొకటి చెయ్యించుకో వచ్చులే...."

"అది బోడిఉంగరమా- ఆ వుంగరం చెయ్యించి మీ వ్రేలిలో పెట్టినప్పటి నుంచీ మీరు అర్ధనారీశ్వరుడే అనుకున్నాను. ఈనాడు పార్వతిని పరులపాలు చేసారు"

"ఏమిటా పిచ్చి వాగుడు?"

"పిచ్చా? మీకు పిచ్చిగానే వుంటుంది అదిగోండి .... ఎవరో పరాయివాడు నన్ను బలవంతంచేస్తున్నాడు,.... రక్షించండి.... రక్షించండి...."

"చామంతీ.... దెయ్యం గాని పట్టిందా? ఏమిటే అర్ధంలేని వాగుడు"

"దెయ్యం పట్టలేదు. ఇప్పుడు నేనే దెయ్యాన్నయాను, ఆ పచ్చ అసలు పచ్చ... అసలుది"


"నాకేరోజు అసలుదని యెందుకు చెప్పలేదు? నేను గాజుముక్క అనుకున్నాను"

"మ అమ్మ గుప్తంగా మా అన్నయ్యలకు తెలియకుండా యిచ్చింది. నాకు లాకెట్ చెయ్యించుకోమంటే అదృష్టం కలిసివస్తుందని మీకు వుంగరం చెయ్యించి యిచ్చాను. మీనోట నువ్వు గింజ దాగదని నేను యీ రహస్యం గుప్తంగా వుంచితే మీరింత పనిచేస్తారని అనుకోలేదు. మీరు ఆవుంగరం పెట్టుకున్న దగ్గర నించి మీకు అబ్బిన వున్నతి చూసి అదంతా నేనే చేస్తున్నానను కున్నాను. ఆ వుంగరాన్ని నేనే. నన్ను తీసుకవెళ్ళి ఒక బికారి వెధవ దగ్గర పడవేస్తారా? ఇది మీకు న్యాయమా? చెప్పండి. నన్ను చంపండి. లేదా ఆ వుంగరం యెంత డబ్బిచ్చియైనా తీసుకరండి"

"రేపు వెళ్తానులే...."

"రేపుకాదు. ఇప్పుడే.: అవసరమైతే యెంత డబ్బయినా యిచ్చి తీసుకురండి"

జయశ్రీ సంక్రాంతి




అని వెర్రిదానిలా ఓక్షణం, హిస్టీరియా వచ్చి తేరుకున్న మనిషిలా మరోక్షణం మారి మొగుడ్ని తరుముతుంది.

అంతరాత్రి మీద యిల్లు కష్టం మీద కనుక్కొని యింటితలుపు తట్టగానే వెన్నను గుమస్తా అంతావిని.

"అయ్యో—మీరిచ్చిన వెంటనే ఒక దలారి తయారయ్యాడు. అమ్మేసాను"

"బాబ్బాబు—నాకు మిగిలింది నా భార్య చామంతి ఒక్కటే. జబ్బులపుట్ట. ఒకప్పుడు హిస్టీరియా, ఇప్పుడు గుండె జబ్బు. ఈవుంగరం పోయిందంటే యిక పిచ్చిదైపోతుంది. అదేమైపోతే నేనూ చచ్చిపోతాను. విచారంతో"

"ఆబద్ధం చెప్పే అవసరం నాకేం లేదు. ఉంటే నా వ్రేలికి వుండేది కాదా? చూడండి" అంటూ రెండు చేతులు చాచుతాడు.

"ఆదలారి యిల్లెక్కడో చెప్పండి"

"ఇవన్నీ తెలుసుకోడానికి నాకు తీరుబడేది? ఏంటయ్యా ఆగాజుపొడి మీద అంత మమకారం? నా పెళ్లాంకి కాసింత పిచ్చివుందనినువ్వూ పిచ్చివాడి వైపోతున్నావ్, అలాంటి వుంగరం ఒకటి రేపు కొనేసి ఆవిడ ముఖంమీద పారేయ్" అంటూ తలుపు ఛటుక్కున బిగించి పోయాడు.

సత్యారావు తలుపు తట్టుతూ "బాబ్బాబూ మీకు పుణ్యం వుంటుంది. ఎన్ని గంటలప్పుడు యెక్కడ యెవరికి అమ్మారో చెప్పండి. నేను వాడికి పట్టుకుని బ్రతిమలుతాను"

లోనుంచే "ఇప్పుడెక్కడ? రేపు ఉదయం రావయ్యా" వచ్చిన సమాధానం విని అక్కడే బయట చలిలో సత్యారావు రాత్రంతా గడిపాడు. ఉదయమే తలుపు తీసిన యిల్లాలు అతని వాటం చూసి "తెల్లారిందా బిచ్చానికి?" అని విసవిస లాడగానే "నాకర్మ యిలా కాలిందని" కళ్ళల్లో తిరిగిన కన్నీటిని ప్రయత్నం రాలకుండా ఆపుకుని "బాబు దగ్గరకు బిక్షకే వచ్చానమ్మా", అని గొణుక్కున్నాడు.

ఆవిడ లోనికి వెళ్తూ "వాడ్ని పంపేకూడదూ? పొద్దున్నే వాడి ముఖం చూశాను. ఈ వేళ ఏమౌతుందో?" వెండి మువ్వల పట్టీలు పెట్టుకున్న యిల్లాలు గేదెలా అరవగానే ఆతగాడు కంపించి బయటకువచ్చి "తిన్నగా పెద్ద బజారుకుపో. ఆ మార్కెట్ గేటు ముందు నగలవ్యాపారస్తుని దుకాణం వుంది. నిన్న నాలుగు గంటలప్పుడు అక్కడే కూర్చున్న దలారికి అమ్మేసాను. వెళ్ళవయ్య. వెళ్ళు"

సత్యారావు ఆత్రుతగా పెదబజారుకు వెళ్లాడు. ఆషాపు తెరచేవరకు క్షణం ఒక యుగం చేసుకుని కాసుకుని కూర్చున్నాడు. ఆడవారిని పట్టుకున్నాడు. ఉంగరం వివరాలు చెప్పగానే దానిని తనే కొన్నట్లు మళ్ళీ మరుక్షణంలోనే పది రూపాయల లాభానికి యింకొకరికి అమ్మేసినట్లు చెప్పాడు. వీడు యీనాటి వ్యాపారికాదు. ఏనాటివాడు? వీడు అసలు పచ్చేదో గాజు పచ్చేదో తెలుసుకోలేడా? ఈ ఉంగరం వీడి దగ్గరేవుంటుంది. ఎంత ఖరీదైనా యిస్తానని బ్రతిమాలుతాడు. దలారి కమ్మని గొంతుకతో

"నేను వ్యాపారిని. నాకు డబ్బు చేదు కాదు నా దగ్గరుంటే యింత సేపా?"

తటపటాయించి చివరకు అది అసలు పచ్చఅని, ధరకట్టించి మరీ అమ్మండని ప్రార్థించాడు.

"ఆ అమ్మిన ఆసామి గాజుపొడి వేసి చెయ్యించానన్నాడు. ఎంతో అవసరం వచ్చి అమ్మానన్నాడు"

"అది వాడి స్వంతమైతే కదా?"

"అది దొంగసొత్తా?"

"లంచం సొత్తు"

"అబ్బబ్బే.. నాకెవరూ వుంగరం అమ్మలేదు. నాకేమీ తెలీదు." ఏ ప్రక్కనించి పోలీసు లొస్తున్నారోనని భయ

పడుతూ యిటూ అటూ బెదురుచూపులు చూస్తూ పారిపోతాడు.

సత్యారావు తిరిగి యింటికి వస్తాడు. జరిగిన దంతా విన్న చామంతి కూలబడి పోతుంది. నెత్తి నోరూ కొట్టుకుని యేడుస్తుంది. "ఒకరుకాదు—ఎందరో కిరాతకులు....నామీద పడి కోరలతో రక్కేస్తున్నారు., రక్తం.. రక్తం.... "ఇలా అరుస్తుంటే మనోవ్యధకు మందు లెక్కడు దొరుకుతాయి. చివరకు యిది వరకు చుట్టూ తిరుగుతున్న జబ్బులే రక్కసుల్లా అమెమీదపడి ఆమెను పీక్కుతినేసాయి. రోజుకు రోజూ క్షీణించి ఒక తెల్లవారు ఝామున చామంతి చచ్చిపోతుంది"

ఎన్నిసార్లు చదివాడోగానీ ఆకథను శేషగిరి ముకుందరావుకు యింత వివరంగాచెప్పి"ఆ కాస్తా చదివినక్షణంనించీ మీకోసం గాలిస్తున్నాను. మీరిచ్చిన పేరుగల మనిషి మీరేనని వెళ్తే వాడింకొకడు. నేనెవరినీ మీ దగ్గరకు పంపలేదు. ఏవుంగరం లంచంగా యివ్వలేదన్నాడు. ఎదటవాళ్ళ పెన్సను గురించి యింత శ్రద్ధ తీసుకుంటున్న మిలాంటి మహానుభావుడ్ని క్షమాపణ చెప్పుకుందామని తిరుగుతుంటే నా అదృష్టం కొద్దీ మీరు యీవేళ తలవని తలంపుగా తారసపడ్డారు. మీరు ఆవేళయిచ్చిన పచ్చపొడి వుంగరం యింకా నాదగ్గరే వుంది. అమ్మలేదు. నాయింటికి రండి యిచ్చేస్తాను. మీ ఆవిడ కివ్వండి."

"నా భార్య పోయింది" చాలా తేలిగ్గా అనేసాడు ముకుందరావు.

"నిజం"

"అవును"

"అయ్యోరామ....నాకెంత పాపం చుట్టుకుంది. మంచివాళ్ళకు బాధపెడితే ఫలితం వెంటనే కనిపిస్తుందని ఆవుంగరం మా యింటికి వచ్చిన దగ్గరనించి తెలుసు కుంటూనేవున్నాను. అంతా చెడుగా కనిపిస్తోంది. ఇప్పుడు ఖూనీ నయ్యాను"

"నాపెళ్ళం పోయి పదేళ్ళయిందయ్యా"

"నిజం—మామ్మయ్య.... ఐనా.... అంత ఖరీదైన పచ్చ పొదిగిన వుంగరం నాకొద్దు బాబోయ్"

"అది రెండురూపాయలనకిలీ పచ్చ"

"ఏడవనీయండి. మీవుంగరం మీరు తీసుకోండి"

"వద్దు. మీకు లంచం యిచ్చి, నేను అంతకు రెండురెట్లు సంపాదించాను"

"ఎలా?"

"ఆనాడు మీరు లంచం కోసం బాధించకపోతే నాకు యీ కథ రాయడానికి ప్లాటు దొరికేది కాదు"

"ఆకథ మీరే రాసారా? నిజంగా మీరేనా?"

"అవును. నేనేరాసాను"

"క్షమించండి. మీరంత గొప్పవారని తెలియక అవరాధం చేసాను"

"అపరాధంకాదు. నేను రచయితగా గర్వించగలిగే కొన్ని మధుర క్షణాలనుయిప్పుడు ప్రసాదించారు. నేనిచ్చిన కానుకగా ఆవుంగరాన్ని స్వీకరించండి"అంటూ ముకుందరావు మళ్ళీ ఆ జన సమూహంలో కలసిపోయి కదలిపోయాడు. ●



Agents:
THE TRADE PROMOTING
CORPORATION
VIJAYAWADA-520 010

Phones: H. O. 77731
B. O. 86222

Vijayadurga Auto Sales Corporation
H. O Governorpet, VIJAYAWADA-2
B. O. Jawahar Autonagar, VIJAYAWADA-7
Suppliers in all kinds of spares for Jeep, Ambassodor, Leyland
T. M. B., Dodge, Bedford J4 & J6 English and American Cars

OUR SISTER CONCERNS

For all Tractors & Industrial spares
INDUSTRIAL & AGRICULTURAL corp.
H. O. Governorpet. Vijayawada-2
B.O. JawaharAutonagar Vijayawada-7

For all Tyres and Tubs:
VIJAYADURGA TYRE CENTER
H. O. Governorpet, Vijayawada-2
B.O. JawaharAutonagar, Vijayawada-7